తేదీ 06.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాల్(బృందావనం)

# నీవు నీ తల్లిదండ్రులను ప్రేమిస్తే ప్రపంచమంతా నిన్ను ప్రేమిస్తుంది

జనని గర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాలలవేవి కానరావు
మంచిముత్యపు సరుల్ మచ్చునకును లేవు
మేల్మి బంగరుదండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు కెంపులు పొదగ లేదు
వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు
గోమేధికంబులు తోడ లేవు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
పూర్వ జన్మల కర్మలు పొందుపరచి
ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి
మంచియైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల

**ప్రేమస్వరూపులారా!** ప్రతి మానవుడు జనని గర్భమునుండి జన్మించే సమయంలో తన కర్మలన్నియు చేర్చిన కంఠమాలను ధరించి వస్తున్నాడనే సత్యాన్ని మనము గుర్తించాలి. అందుచేత, ఏ కర్మనైనా ఆచరించేముందు ఇది మంచిదా? చెడ్డదా? అని విచారణ చేయాలి.

sri sathyasaivachanamrutam

మనం కోరినను, కోరకపోయినను మంచి కర్మలు మంచి ఫలితము నందిస్తాయి. చెడ్డ చూపులు, చెడ్డ మాటలు, చెడ్డ ఆలోచనలు, చెడ్డ కర్మలు ... ఇవన్నీ చాలా ప్రమాదాన్ని తెప్పిస్తాయి. *"కన్నుల నిచ్చినదెందుకొ తెలుసా? అన్నీ చూసేటందులకా? కాదు, కాదు. కైలాసవాసుని కన్నులారా గాంచేటందుకురా! మనసు నిచ్చినది ఎందుకొ తెలుసా? సందులు గొందులు తిరుగుటకా? కాదు, కాదు. సుందరమైన భగవంతుని రూపమును దర్శించి, భగవన్నామమును మనసారా స్మరించి, ఆనందమును అనుభవించేటందుకురా!'*

ఈవిధంగా విచారణ చేసి, ఏది మంచి? ఏది చెడ్డ? అనేది గుర్తించి వర్తించాలి. అప్పుడప్పుడు మన దృష్టి చాలా చెడ్డగా ప్రసరిస్తూ ఉంటాది. 'ఛీ, పరులను చూసేటందుకా భగవంతుడు నాకు కన్నుల నిచ్చినది! కాదు, కాదు. మంచివారిని చూడాలి', అని ఎవరికి వారు బుద్ధి చెప్పుకోవాలి. అనేకమంది చెడ్డ పలుకులు పలుకుతూ ఉంటారు; పరదూషణ చేస్తుంటారు. ఇది మహాపాపం. పరులను దూషించుటకు బదులు మీలో ఉన్నటువంటి చెడ్డను మీరు దూషించుకోండి. ప్రతి మానవునికి కర్మఫలితం అనుభవించక తప్పినది కాదు. జగత్తులో పుట్టిన ప్రతి వ్యక్తికి మంచి, చెడ్డ రెండూ జరుగుతూనే ఉంటాయి. మహనీయులు ఈ సత్యాన్ని గుర్తించి చెడ్డను మరచి, మంచిని మాత్రమే మనసులో పెట్టుకొని ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటారు.

**పంచేంద్రియాలను పవిత్రంగా వినియోగించుకోండి**

ఈ జగత్తును 'ప్రపంచము' అని పిలుస్తున్నాము. ప్రపంచము అనగా పంచభూతములయొక్క ప్రకాశమే, పంచభూతములయొక్క వికాసమే! మానవుడు తన పంచేంద్రియములను, పంచభూతములను పవిత్రమైన మార్గములో అనుభవించినప్పుడే తన జన్మ సార్థక మవుతుంది. ఈనాటి మానవుడు వీటిని అపవిత్రమైన మార్గములో ప్రవేశపెడుతున్నాడు. పైగా, అది తనకు సహజమని భావిస్తున్నాడు. కాని, అది సహజం కాదు. అప్పటికప్పుడు మనకు సహజంగా అనిపించవచ్చుగాని, ముందు పర్వతములవంటి కష్టాలు మనలను తరుముకొని వస్తాయి. మన పంచేంద్రియాలలో దేనినికూడను మనము అపవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టకూడదు. ఏదైనా చెడ్డ

sri sathyasai vachanamrutam

తేదీ 06.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాల్(బృందావనం)

జరుగుతుంటే మనం చూస్తూ ఉంటాము. ఎవరైనా చెడ్డ మాటలు చెబుతుంటే రెండు చెవులూ ఇచ్చి ఎంతో ఆసక్తిగా వింటూ ఉంటాము. 'ఇతరుల మాటల నింపుగ నమ్మి కొంపతీయకండి.' భగవంతుడు మీకు రెండు చెవులనిచ్చాడు. వాటితో మంచి మాటలు వినండి; పవిత్రమైన దైవతత్త్వాన్ని, దైవనామాన్ని వినండి. రెండు కన్నుల నిచ్చాడు మీకు భగవంతుడు. వాటితో సుందరమైన దైవస్వరూపాన్ని దర్శించండి. అట్టి జీవితమే నిజమైన మానవ జీవితం. ఈవిధంగా, మానవుడు తన పంచేంద్రియములద్వారా పవిత్రమైన కర్మలను ఆచరించినప్పుడే 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్న నానుడి సార్థకమవుతుంది; లేకుండిన జీవితం అపవిత్రమై పోతుంది. అలాంటి జీవితమొక జీవితమా! అది మరణంతో సమానం. కనుక, బాలబాలికలుగాని, పెద్దలుగాని పంచేంద్రియాలను సద్వినియోగపర్చుకోవాలి.

మానవత్వమనేది మహాపరిశుద్ధమైనటువంటిది. 'మా' అనగా మాయ; 'న' అనగా లేకుండా; 'వ' అనగా వర్తించడం. మాయను మరచి వర్తించడమే నిజమైన మానవత్వం. మానవుడు ఈనాటివాడు కాదు, ప్రాచీనుడే. నాటినుండి నేటివరకు మానవత్వాన్ని ధరిస్తూనే వస్తున్నాడు. కాని, ఇన్ని జన్మలెత్తికూడను ఇంకా మానవత్వముయొక్క విశిష్టతను గుర్తించుకొనలేకపోతున్నాడు. ఎంతకాలమైనను తినటం, త్రాగటం, సుఖాల ననుభవించడం, చివరికి మరణించటం .... ఇదేనా మానవత్వముయొక్క విశిష్టత! ఈవిధమైన జీవితాన్ని పశుపక్షిమృగాదులుకూడను గడుపుతూనే ఉన్నవి. మానవునిగా పుట్టి నీవు కేవలం పశువులు చేసే పనులు చేయవచ్చునా?! నీకు కలిగిన కష్టాలకు పరులను నిందిస్తావు. నీకు కోపమొస్తే ఒకరిని కొడతావు. కాని, కోపము మానవునియొక్క లక్షణమా? కాదు, కాదు. ఇది క్రూరమృగముల లక్షణం.

**పాశ్చాత్య సంస్కృతికి దాసులవుతున్న ఆధునిక విద్యార్థులు**

ప్రేమస్వరూపులారా! తల్లిగర్భమునుండి జన్మించినప్పుడు మీలో ఎట్టి వాంఛలూ లేవు. కాని, పెరుగుతూ పెరుగుతూ రాగా వాంఛలుకూడా పెరుగుతున్నాయి. వాంఛలకు ఒక పరిమితి ఉండాలి. జీవితంలో దేనికైనా ఒక పరిమితి అవసరం. కాని, ఈనాటి మానవుడు

sri sathyasaivacharamrutam

## తేదీ 06.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాల్(బృందావనం)

హద్దులు మీరి ప్రవర్తిస్తున్నాడు. దీనికి తగినట్లు ఈనాడు అనేకవిధములైన ఆధునిక సదుపాయములు ఏర్పడుతున్నాయి. మీకందరికీ తెలుసు - ఇప్పుడు సెల్‌ఫోన్‌లు వస్తున్నాయి. వీటిద్వారా ఎవరితోనైనా, ఎక్కడైనా సులభంగా మాట్లాడుకోవచ్చునని మీరు ఆనందిస్తున్నారు. వీటిద్వారా కష్టం లేకుండా పనులు జరుపుకోవచ్చునని భావించి ప్రభుత్వముకూడా వీటి వాడకాన్ని ప్రోత్సహిస్తున్నది. కాని, ఈవిధమైన యంత్రాల వల్ల, తంత్రాలవల్ల విద్యార్థుల బుద్ధులు పెడమార్గం పడుతున్నాయి. వీటిని దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటివి విద్యార్థులను పాపంలో ప్రవేశపెట్టి నాశనం చేస్తున్నాయి. ఏమీ తెలియని అమాయకులనుకూడా మాయలో ముంచుతున్నాయి. ఈనాటి విద్యార్థులు చాలా తెలివిగలవారు. వారికి ఏది ముఖ్యమో, నిత్య జీవితములో ఏది అవసరమో దానికి తగిన విద్యలు బోధించాలి. కాని, పాశ్చాత్య సంస్కృతి ప్రభావంచేత మితిమీరిన వాంఛలను కలిగించే విద్యను విద్యార్థులకు నేర్పించడానికి ప్రయత్నిస్తున్నారు. మన భారతీయ సంస్కృతి చాలా ఉత్తమమైనది, అందరికీ ఆదర్శంగా నిలిచినటువంటిది. కాని, భారతీయులు తమ సంస్కృతిని విస్మరించి పరదేశీయులకు దాసులై వారు నేర్పిన విద్యలను నేర్చుకుంటున్నారు. ఆడ, మగ అనే భేదము లేకుండా ప్రవర్తిస్తున్నారు. మన ప్రాచీన భారతీయ స్త్రీలెంత ఆదర్శవంతంగా నడుచుకున్నటువంటివారు! అనాదికాలమునుండి భారతీయసంస్కృతి ప్రపంచానికి వెలుగుబాటను చూపిస్తూ వచ్చింది. కాని, అసలు సంస్కృతి అంటే ఏమిటో ఈనాడు పెద్దలకు కూడా తెలియదు. ప్రాచీన కాలంలో గుణవంతులైన స్త్రీ, పురుషులు ఎన్నో త్యాగాలు చేసి భారతీయ సంస్కృతిని నిలబెడుతూ వచ్చారు. నిరత సత్యప్రౌఢి ధరణి నేలిన హరిశ్చంద్రుడు ఈ భారత దేశమునందే జన్మించాడు.

**గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి**
**సావిత్రి భారత సతియె కాదె!**
**తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతి పవిత్ర పడతి కాదె!**
**కులసతీత్వమునకై గుండాన దూకిన**
**సీత భారత ధరా జాత కాదె!**

sri sathyasaivachanamrutam

తేదీ 06.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాల్(బృందావనం)

**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి కాదె!**

కాని, ఈనాటి ప్రజలు వీరి ఆదర్శాలను విస్మరించారు. సీత, సావిత్రి, దమయంతి వీరంతా స్త్రీ అంటే అబల కాదని, ఆమెలో ఉన్న దివ్యశక్తి ఎంతో గొప్పదని నిరూపించారు. కాబట్టి, స్త్రీలను మనము చులకన చేయకూడదు.

**పరమపావనమైన భారతావనియందు**
**సహన మన్నదె మనకు చక్కదనము**
**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృభావముకంటెను మాన్యమెద్ది?**

మాతృప్రేమను మించినటువంటి ప్రేమ ఈ జగత్తులో కనిపించదు. అలాంటి మాతృప్రేమను ఈనాడు విస్మరిస్తున్నారు. మాతృమూర్తిని ప్రేమించినప్పుడే మనము మహత్తరమైన శక్తిని సాధించినవారమవుతాము. ఈనాడు 'పేరెంట్స్'ను 'సర్వెంట్స్'మాదిరి చూస్తున్నారు. వయస్సు పైబడిన తల్లిదండ్రులను ఎంతో ప్రేమతో చేరదీసి, తగినరీతిగా పోషించడానికి బదులు వాళ్ళను వృద్ధాశ్రమాలకు తరలిస్తున్నారు. రేపటి దినము తమకు ఏ గతి పడుతుందో అని ఆలోచించడం లేదు. ఈనాడు నీ తల్లిదండ్రులను నీవు వృద్ధాశ్రమానికి పంపితే రేపటి దినము నీ బిడ్డలుకూడా నీకు అదే గతి పట్టిస్తారు. 'యద్భావం తద్భవతి'. నీవు ఏమేమి చేస్తావో అవన్నీకూడా 'రిఫ్లెక్షన్', 'రియాక్షన్', 'రీసౌండ్'లుగా నీకు తిరిగి వస్తాయి. నీ తల్లిని నీవు ప్రేమతో చూసుకో. తల్లి ప్రేమయే నీకు సర్వులయొక్క ప్రేమను సంపాదించిపెడుతుంది. ఈనాడు నీ తల్లిని నీవు 'సర్వెంటు'గా చూస్తే రేపటి దినము నిన్ను నీ బిడ్డలు 'సర్వెంటు' మాదిరి చూస్తారు. వేసిన విత్తనము ఎట్టిదో మొక్క అట్టిదిగానే వస్తుంది. కనుక, మనము పవిత్రమైన ప్రేమను పెంచుకోవాలి. ఈనాడు మనము ప్రేమను పంచినప్పుడే రేపటి దినము ప్రపంచమంతా మనల్ని ప్రేమిస్తుంది. స్వార్థస్వప్రయోజనములతో మన ప్రేమను కలుషితం గావించకూడదు.

దేహములన్నియు బల్బులవంటివి. భగవంతుని దివ్యశక్తి, ఆత్మశక్తి కరెంటువంటిది. ఇక్కడ అనేక దీపములు వెలుగుతున్నాయి. ఈ అన్ని దీపములకు కరెంటే ఆధారము. ఒక్క

sri sathyasaivachanamrutam

మెయిన్ స్విచ్‌ని ఆపివేస్తే దీపములన్నీ ఆరిపోతాయి. ఆ కరెంటువంటిదే భగవత్తత్త్వము. ఆ 'మెయిన్ స్విచ్'ని ఆపితే అన్ని జీవులూ నిర్జీవులైపోతాయి. అందుకనే కృష్ణ పరమాత్మ, 'మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః', 'అందరూ నా అంశములే' అన్నాడు. అందరియందున్న ఆత్మ అనే కరెంటు ఒక్కటే. నీవు నా అంశమైనప్పుడు నావలె నీవుండాలి కదా! నాలో ఉన్న శక్తియే నీలో ఉండాలి కదా! ప్రపంచములో ఉన్న ప్రతి వ్యక్తీ, ప్రతి ప్రాణి కూడను దైవాంశమే. కాబట్టి, ఎవరిని చూసినా మనం నమస్కారం చేయాలి. ప్రతి వ్యక్తినీ గౌరవించాలి, ప్రేమించాలి. అప్పుడే మన జీవితము ప్రకాశిస్తుంది. మానవత్వము చాలా పవిత్రమైనది. మానవునియందున్న ప్రేమతత్త్వము అపరిమితమైనటువంటిది. ఆ ప్రేమయొక్క శక్తి ఇట్టిది, అట్టిది అని ఎవరూ వర్ణించలేరు.

**నిత్యసత్యమైనది ఆత్మప్రేమ, వాంఛలతో మిళితమైనది దేహప్రేమ**

ప్రాపంచికమైన ప్రేమ దినదినానికీ మార్పు చెందుతూ ఉంటుంది. ఉదాహరణకు, పెండ్లి అయిన తరువాత మొదటి వారం రోజులు భార్యను వదలి భర్త క్షణమైనా ఉండలేడు. ఇద్దరూ కలసి నడుచుకుంటూ వెళుతున్నప్పుడు దారిలో ఎక్కడైనా ముల్లు కనిపిస్తే, భర్త ఎంతో ఆదుర్దాగా, 'ముల్లు, ముల్లు, ముల్లు' అంటూ భార్య చేయి పట్టుకొని ప్రక్కకు లాగుతాడు. ఒక నెల తరువాత మళ్ళీ దారిలో ముల్లు కనపడితే, 'త్రొక్కుతావు, జాగ్రత్త' అని కేవలం హెచ్చరిస్తాడు. ఇంకొక ఆరు నెలలైన తర్వాత, 'నీకు కళ్లు కనిపించడం లేదా? ముల్లుంది అక్కడ' అని కోప్పడతాడు. ఈరీతిగా, ప్రాపంచికమైన ప్రేమ దినదినానికీ తరిగిపోతుంది. ఈనాటి కాల పరిస్థితినిబట్టి భార్యాభర్తలు విడాకులు కూడా తీసుకుంటున్నారు. కాని, పూర్వకాలంలో పరిస్థితి ఈవిధంగా ఉండేది కాదు; ప్రారంభమునుండి అంత్యమువరకు ప్రేమ ఒకేరీతిగా ఉండేది. అదే నిజమైన ఆత్మప్రేమ. దేహప్రేమ మార్పుచెందుతుంది. అది వాంఛలతో మిళితమై ఉంటుంది; కదిలిపోయే మేఘం లాంటిది. భగవత్ప్రేమ ఒక్కటే శాశ్వతమైనది. అట్టి నిత్య సత్యమైన ప్రేమను వదలి అశాశ్వతమైన, అసత్యమైన ప్రేమను పట్టుకొని మీరు ఎందుకింత ప్రాకులాడుతున్నారు? కాని, ఈవిధమైన సద్బోధలు చేసే పెద్దలు నేడు చాలా అరుదుగా ఉన్నారు. అసలు పిల్లలకంటే పెద్దలే ఎక్కువగా ఆధునికత మోజులో పడి మారిపోతున్నారు. 'మాతృదేవో

srisathyasaivechanamrutam

భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ', అన్నారు. కాని, ఈనాటి పిల్లలయందు తమ తల్లిదండ్రులపట్ల అటువంటి ప్రేమ, గౌరవ భావములు కనిపించడం లేదు. ఇది మానవత్వము కాదు. ప్రతి మానవునికి భగవంతుడు పవిత్రమైన బుద్ధిని, విచక్షణా శక్తిని ప్రసాదించాడు. వాటిని సద్వినియోగపరచుకున్నవాడే నిజమైన మానవుడు. ఆధునికత పేరిట కాలాన్నిబట్టి మారిపోవడం తెలివితక్కువతనం.

**సత్య, ప్రేమలచేతనే మానవత్వం వికసిస్తుంది**

ఏ దేశమునందైనా, ఏ కాలమునందైనా దేనినైనా మార్చవచ్చునుకాని, సత్యమును మార్చగలిగేవాడు ఈ జగత్తులో లేడు. సత్య, ప్రేమలచేతనే మానవత్వము వికసిస్తుంది, వర్ధిల్లుతుంది. ఈనాడు ఎవరికి తోచినట్లు వాళ్ళు పోతున్నారు; అల్పబుద్ధులతో ప్రవర్తిస్తున్నారు గాని, విశాలమైన బుద్ధిని ఎవరూ చూపించడం లేదు. సమాజమునకు ఏది ముఖ్యము? మన దేశమునకు ఏది ప్రధానము? అనే విషయాన్ని మనము లోతుగా విచారించాలి. మానవుడు మారినప్పుడే దేశము మారుతుంది. దేశమంతా మానవత్వంపైన ఆధారపడి ఉన్నది. కాని, మనము మానవత్వాన్ని మరచిపోయి పాశ్చాత్య పద్ధతులను అనుసరిస్తున్నాము. ఆవిధంగా నీ బుద్ధికి తోచినట్లు నీవు మార్చుకోకూడదు. వారి పద్ధతులు వారికుండనీ; నీ పద్ధతి నీకుండాలి. ఎవరి పద్ధతులను వారు మార్చుకోకుండా అనుసరించాలి. ప్రేమయే మానవునికి ప్రధానమైన లక్షణము. ప్రేమయే ప్రాణం. ప్రేమపోతే ప్రాణం పోయినట్లే! కనుక, దివ్యాత్మస్వరూపులారా! ప్రేమస్వరూపులారా! ప్రేమను మీరు ప్రధానంగా పెట్టుకోండి. సత్యాన్ని మీ మార్గంగా తీసుకోండి. అప్పుడే మీ జీవితం సార్థకమవుతుంది. దివ్యత్వాన్ని పొందుతారు. పవిత్రతను పొందుతారు. ఎక్కడకూడను, ఎలాంటి పరిస్థితులందైనను మీరు సత్యాన్ని మార్చడానికి ప్రయత్నించకూడదు. 'ఇది నా ఇష్టము' అని హద్దులు మీరి ప్రవర్తించకూడదు. ప్రకృతియొక్క అభీష్టమును మీరు అనుసరించాలి. ప్రకృతికి విరుద్ధంగా పోయినట్లయితే మీ జీవితమే నాశనమైపోతుంది.

**ఆదర్శమాత - ఆదర్శ పుత్రుడు**

తల్లిగర్భమునుండి జన్మించినందుకు మీరు తల్లికి సత్కీర్తి తెప్పించాలి. ఒకానొక

sri sathyasai vachanamrutam

సమయంలో కలకత్తాకు సమీపంలోని ఒక గ్రామంలో ఒక మహావ్యక్తి నివసించే వాడు. అతని పేరు ఈశ్వరచంద్ర విద్యాసాగర్. అతనొక బీద కుటుంబంలో పుట్టాడు. వాళ్ళకు పూట గడవడమే కష్టంగా ఉండేది. తల్లి శ్రీమంతుల ఇళ్లలో పాత చీరలు కుట్టి ఎంతో కొంత డబ్బు సంపాదించేది పాపం! ఒక రొట్టె చేస్తే అందులో సగం తాను తిని సగం కుమారునికి పెట్టేది. ఒక్కొక్కతూరి ఉన్నదంతా కుమారునికి పెట్టి తాను పస్తుండేది. ఈవిధంగా ఎంతో కష్టపడి కుమారుని పోషిస్తూ వచ్చింది. రాత్రివేళ ఇంట్లో దీపం లేదు. అందుచేత, విద్యాసాగర్ వీధి దీపాలదగ్గర కూర్చుని చదువుకునేవాడు. ఈవిధంగా రాత్రింబవళ్ళు అతను కష్టపడి చదివి డిగ్రీ పూర్తి చేశాడు. మొట్టమొదట ఏదో ఒక చిన్న ఉద్యోగంలో చేరాడు. అతనికి లభించే కొద్దిపాటి జీతంతో తల్లీ కొడుకులు జీవనం సాగిస్తూ వచ్చారు. కొంతకాలమైన తరువాత అతనికి ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. జీతంకూడా పెరిగింది. ఒకనాడు అతని తల్లి ఒక పాత చీర కట్టుకొని ఆ ఊళ్ళో జరుగుతున్న తిరునాళ్ళకు బయలుదేరింది. అది చూసి విద్యాసాగర్ చాలా బాధపడి, 'అమ్మా, ఈనాడు ఊరంతా పండుగ చేసుకుంటున్నారు. నీవుకూడా ఒక మంచి చీర కొని కట్టుకోకూడదా?' అన్నాడు. వెంటనే తాను స్వయంగా బజారుకు వెళ్ళి ఒక ఖరీదైన తెల్లచీర కొని తెచ్చి, 'అమ్మా, ఈనాడు నీవు దీనిని కట్టుకొని తిరునాళ్ళకు వెళ్ళు', అని కోరాడు. అప్పుడా తల్లి, 'నాయనా! నాకు మూడు కోరికలున్నాయి. అవి తీరిన తరువాతనే నేను ఈ చీరను కట్టుకుంటాను', అన్నది. 'ఏమిటమ్మా ఆ కోరికలు?' అని అడిగాడు. 'ఇప్పుడు కాదు నాయనా! సమయం వచ్చినప్పుడు తప్పక అడుగుతాను', అన్నది. కొంతకాలానికి విద్యాసాగర్ మరింత ఉన్నతస్థితికి చేరుకున్నాడు. అప్పుడతను, 'అమ్మా! ఇప్పుడైనా నీ కోరికలేమిటో చెప్పు', అన్నాడు. 'నాయనా! మన గ్రామంలో కనీసం ఒక చిన్న పాఠశాల లేకపోవడం వలన ఇక్కడి పిల్లలు చదువుకోసం ప్రక్క గ్రామానికి వెళుతున్నారు. కాబట్టి, నీవు మన గ్రామంలోనే ఒక చిన్న పాఠశాల కట్టిస్తే నేను ఆనందిస్తాను', అన్నది. తనకు వచ్చిన ఆదాయంతో విద్యాసాగర్ ఒక చిన్న బడి కట్టించి, ఆ గ్రామంలోని పిల్లలకు చదువు చెప్పించే ఏర్పాటు చేశాడు. 'అమ్మా! నీకీనాడు సంతోషంగా ఉన్నదా?' అని అడిగాడు. 'లేదు, నాయనా! నాకింకా రెండు కోరికలున్నాయి', అన్నది. కొంతకాలమైన తరువాత, 'నాయనా! మన గ్రామ ప్రజలు

sri sathyasai vachanamrutam

త్రాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. మన వీధిలో ఉన్న స్త్రీలందరూ దూరంగా ఉన్న నదికి వెళ్ళి నీళ్లు తెచ్చుకోవడం చూస్తుంటే నా మనసుకు చాలా కష్టంగా ఉన్నది. నీవు మన గ్రామంలో ఒక చిన్న బావి త్రవ్వించకూడదా?' అని అడిగింది. విద్యాసాగర్ గ్రామంలో ఒక బావి త్రవ్వించాడు. ఆ తరువాత తల్లి కోరిక మేరకు ఒక చిన్న ఆసుపత్రికూడా కట్టించాడు. తల్లి ఎంతో సంతృప్తి చెంది, కుమారుడు తెచ్చిన క్రొత్త చీరను ఆనాడు ధరించింది.

**ఐ.సి.ఎస్. ఆఫీసర్‌కి కనువిప్పు**

క్రమక్రమేణ విద్యాసాగర్ గొప్ప పేరుప్రఖ్యాతులు గడించాడు. విద్యాసాగర్ ఉపన్యాసాలు వినడానికి ప్రజలు వేలసంఖ్యలో ప్రోగయ్యేవారు. ఒక పర్యాయం విద్యాసాగర్ ట్రైనులో ప్రయాణమై వేరే ఊరికి వెళ్ళాడు. ఆరోజున ఆ ఊర్లో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించవలసి ఉండినది. ఆయనతో 1పాటు ఒక ఐ.సి.ఎస్. ఆఫీసర్ ఒక చిన్న సూట్‌కేసు పట్టుకొని స్టేషన్లో దిగాడు. దిగుతూనే ఆ ఆఫీసరు తన పెట్టె మోయడానికి ఎవరైనా కూలీ దొరుకుతాడేమోనని చూస్తున్నాడు. ఆయన 'కూలీ, కూలీ' అని అరుస్తుంటే విద్యాసాగర్ వెళ్ళి, 'సార్, ఆ పెట్టె నాకివ్వండి. నేను తెస్తాను. మీరెక్కడికి వెళ్ళాలి?' అని అడిగాడు. 'నేను ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఉపన్యాసం వినడానికి వెళుతున్నాను', అన్నాడా అధికారి. ఆ మాటలు విని విద్యాసాగర్ నవ్వుకొని ఆ పెట్టె పట్టుకొని బయలు దేరాడు. ఆయన వెనుక ఆ ఐ.సి.ఎస్. ఆఫీసరు దర్పంగా నడుచుకుంటూ వెళ్ళాడు. సమావేశం జరిగేచోటికి వెళ్లిన తరువాత విద్యాసాగర్ అతనికి సూట్‌కేసును అందజేయగా అతను కొంత డబ్బివ్వబోయాడు. అప్పుడు విద్యాసాగర్, 'అయ్యా, నేను కూలీని కాను. నేనీ పని కేవలం సేవాభావంతో చేశాను కాని, డబ్బుకోసం కాదు', అన్నాడు.

సమావేశంలో అంతా కూర్చున్నారు. విద్యాసాగర్ వేదికపైకి వస్తూనే కార్యక్రమ నిర్వాహకులు పూలమాలలతో విద్యాసాగర్‌కు స్వాగతం పలికారు. తన సూట్‌కేసు మోసుకొని వచ్చిన వ్యక్తియే ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అని తెలుసుకొని ఆ ఐ.సి.ఎస్. ఆఫీసరు నిశ్చేష్టుడైనాడు. తాను చేసిన పనికి సిగ్గుపడ్డాడు. ఆనాడు విద్యాసాగర్ చాలా

sri sathyasaivachanamrutam

ఉత్తేజకరమైన ప్రసంగం చేశాడు. 'ఇతరులతో మనం సేవ చేయించుకోవడంలో గొప్పతనం లేదు. మనమే ఇతరులకు సేవ చేయాలి. దీనులను, నిస్సహాయులను ఆదుకోవాలి. సమాజ సేవయే మానవుని ప్రధాన కర్తవ్యం', అని ఆయన ఉద్బోధించాడు. సభ ముగియగానే ఆ ఐ.సి.ఎస్. అధికారి పరుగెత్తిపోయి విద్యాసాగర్ పాదాలపై పడి, 'సార్, మీ మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని గుర్తించలేక నేను మహాపాపం చేశాను. నన్ను క్షమించండి', అని ప్రార్థించాడు.

**మాతృమూర్తి ఈశ్వరమ్మ కోరిన మూడు కోరికలు**

విద్యాసాగర్ మాదిరిగానే ఈ సత్యసాయికూడా తల్లి కోరిన మూడు కోరికలనూ నెరవేర్చినాడు. ఒకనాడు ఈశ్వరమ్మ చాలా విచారంగా ఉండడం గమనించి నేను, 'ఎందుకింత విచారంగా ఉన్నావు?' అని అడిగాను. 'స్వామీ! మన గ్రామంలోని చిన్నచిన్న పిల్లలు పెద్దపెద్ద పుస్తకాలు మోసుకొని బుక్కపట్నం స్కూలుకి వెళుతున్నారు. అంతదూరం నడవడం వారికి చాలా కష్టంగా ఉన్నది. కాబట్టి, మన గ్రామంలోనే ఒక చిన్న బడి కట్టించండి', అని కోరింది. వెంటనే నేనొక స్కూలు కట్టించాను. మరికొంతకాలమైన తరువాత ఆమె మళ్ళీ నాదగ్గరికి వచ్చి, 'స్వామీ! మన గ్రామంలో సరియైన వైద్యసౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఏ చిన్న జబ్బు చేసినా బుక్కపట్నం వెళ్ళవలసివస్తోంది. ఏ డాక్టరు దగ్గరికి వెళ్ళినా డబ్బిస్తే తప్ప మందివ్వడు. మన గ్రామంలోని ప్రజలు చాలా బీదవారు; చేతిలో కాసు లేదు. కాబట్టి, ఇక్కడే ఒక చిన్న ఆసుపత్రి కట్టించండి' అని కోరింది. నేను రెండవ దినమే పని ప్రారంభించి ఒక ఆసుపత్రి కట్టించాను. మరో రోజున ఈశ్వరమ్మ, 'స్వామీ! ఆ చిత్రావతికి వెళ్ళి, ఆ ఇసుకలో నడుచుకుంటూ అంత దూరంనుండి నీళ్ళు తెచ్చుకోవడం మన గ్రామంలోని స్త్రీలకు చాలా కష్టంగా ఉన్నది' అన్నది. తప్పక నీటిసమస్య తీరుస్తానని చెప్పి మొట్టమొదట ఒక బావి త్రవ్వించాను. క్రమక్రమేణ వందల మైళ్ళ దూరంనుండి పుట్టపర్తికి నీరు తెప్పించాను. అందరికీ నీరందించాను. ఆనాడు ప్రారంభించిన చిన్న హాస్పిటల్‌ను ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చివేశాను. చిన్న స్కూలును యూనివర్సిటీగా మార్చేశాను. తన మూడు కోరికలు ఈవిధంగా నెరవేరడం చూసి ఈశ్వరమ్మ ఆనందబాష్పాలు రాల్చింది. ఆమె ఎంతో సంతృప్తిగా కన్ను మూసింది.

sri sathyasaivacharamrutam

తల్లిని సంతోషపెట్టడం బిడ్డల కర్తవ్యం. మనకు చేతనైనంతవరకు సమాజ సేవ చేయాలి. శక్తికి మించి చేయకూడదు. స్త్రీలుకూడను తమ తోటి స్త్రీ ఏమైనా బాధపడుతుంటే, ఆమెను ఓదార్చాలి. ఆమెకు తగిన అనుకూలాలు చేయాలి, ఆనందాన్నివ్వాలి. ఇదియే ఈనాడు మీరు నేర్చుకోవలసినది. 'ఈశ్వరమ్మ డే' సందర్భంగా ముఖ్యంగా ఈ మూడూ మీరు నేర్చుకొని, ఆచరణలో పెట్టి, ఇతరులకు ఆనందాన్నందించి, మీలో కూడా ఆనందాన్ని పెంచుకోవాలి.

**(తేదీ 06.05.2006, సాయిరమేశ్ క్రిషన్ హాల్(బృందావనం)**

sri sathyasai vachanamrutam